రామయ్యకు సర్వాంగ స్వర్ణ కవచాలంకరణ

నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, డిసెంబర్ 7: భద్రాచలం సీతారామచంద్రస్వామి దివ్య క్షేత్రం అంతరాలయంలో మూలవరులకు అర్చకులు శుక్రవారం సర్వాంగ స్వర్ణ కవచాలను ధరింపజేశారు. నిత్య కల్యాణ మూర్తులకు బేడా మండపంలో కల్యాణం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

వృద్ధ దంపతులకు ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్సై నాగుల్ మీరా

పినపాక, డిసెంబర్ 8: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన వృద్ధ దంపతులకు కొయ్యల కుమారస్వామి-వెంకటలక్ష్మి ఇల్లు ఇటీవల వర్షాలకు కూలిపోయింది. దీంతో వారు నిరాశ్రయులయ్యారు. దీనికి గ్రామ యువత స్పందించి, రూ.5వేలు పోగు చేసింది. ఈ మొత్తాన్ని ఆ దంపతులకు శుక్రవారం ఈబయ్యారం ఎస్సై నాగుల్‌మీరా ద్వారా అందించింది. మండల కాంగ్రెస్ నాయకులు 20 కేజీల బియ్యం, నగదు ఇచ్చారు. లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నర్సింహారావు, పురుషోత్తం పాల్గొన్నారు.

మణుగూరులో టీబీజీకేఎస్‌కే 'గుర్తింపు'

కవితతో మణుగూరు ఏరియా నాయకులు

మణుగూరు టౌన్, డిసెంబర్ 8: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో మణుగూరు ఏరియాలో గెలుస్తామని టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు వూకంటి ప్రభాకర్‌రావు అన్నారు. టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం హైదరాబాద్‌లోని తన స్వగృహంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. వూకంటి మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి కృషి చేసిన, ఎన్నో హక్కులు సాధించిన టీబీజీకేఎస్‌కు కార్మికుల మద్దతు ఉందని అన్నారు. కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ అబ్దుల్‌ర వూఫ్, బ్రాంచి నాయకులు వీరభద్రయ్య, కాపా శివాజి, సిహెచ్.వెంకటేశ్వరరెడ్డి, బానోత్ కృష్ణ, నాగెల్లి వెంకట్, అజీజ్, రాజేష్, మురళీకృష్ణ, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేత

భోజన ప్లేట్లతో పాఠశాల విద్యార్థులు

మణుగూరు టౌన్, డిసెంబర్ 8: సింగరేణి ఉద్యోగి, సేవాసమితి సభ్యుడు నాసర్‌పాషా తన తండ్రి గౌస్ జ్ఞాపకార్థం టీ-నర్సాపురం జడ్పీ హైస్కూల్‌లో 300 మంది విద్యార్థులకు శుక్రవారం భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు సామంతపూడి సూరిబాబు సన్మానించారు.

పెద్దమ్మ తల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచ రూరల్, డిసెంబర్ 8 : మండలంలోని జగన్నాథపురం- కేశవాపురం గ్రామాల మధ్య ఉన్న పెద్దమ్మతల్లి ఆలయంలో కనకదుర్గ అమ్మవారికి శుక్రవారం అర్చకులు పంచామృతాభిషేకాన్ని ఘనంగా జరిపారు. అమ్మవారి జన్మస్థలం వద్ద ప్రత్యేక పూజలు చేసి పసుపు, కుంకుమ, గాజులు, ఒడిబియ్యం సమర్పించారు. మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పం, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వరి రైతులారా..

చలి కాలం.. జర పైలం

సారపాక, డిసెంబర్ 8: ఈ చలి కాలంలో రైతులంతా జర జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు. ఈ కాలంలో వరికి తెగుళ్లు సోకుతాయి. నారు మడి వేసినప్పటి నుంచి కోత కోసేంత వరకు మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. ఈ తెగుళ్లు, మందుల పిచికారీ బెడద తప్పాలంటే.. రైతులు ఏమేం చేయాలో వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అవేమిటో చూద్దాం.

ఇలా చేయండి

నారు మడిలో చలి తీవ్రతను అధిగమించేందుకు సాయంత్రం వేళల్లో నీరు పెట్టాలి. దానిని ఉదయం తీసివేయాలి.

- నారు మడికి వెచ్చదనాన్ని అందించేందుకు కోళ్ల ఎరువు గానీ, గొర్రెల ఎరువుగానీ, వర్మీకంపోస్ట్‌గనీ వాడాలి.
- చలి తీవ్రత నుంచి నారు మడిని రక్షించేందుకు.. ఒక అడుగు ఎత్తులో వెదురు బొంగులు పాతి, వాటిపై ప్లాస్టిక్ షీట్లను రాత్రి పూట వేయాలి. వాటిని ఉదయం తొలగించాలి.
- చలి కాలంలో పోషకాలు సరిగ్గా అందక, కొన్నిసార్లు జింక్ లోపంతో ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడతాయి. జింక్ లోపాన్ని నివారించేందుకు జింక్ సల్ఫేట్ రెండు గ్రాములను లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- ఎకరానికి సరిపడే రెండు గుంటల నారు మడికి రెండు కిలోల నత్రజనిని రెండు దఫాలుగా 6.25 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా రెండు కిలోల డీఏపీ, ఒక కిలో పొటాష్‌ను ఇచ్చే ఎరువులను వాడితే చలి తీవ్రత నుంచి నారు మడులను కాపాడుకోవచ్చు.

పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే తెల్లం

ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెల్లం

పర్ణశాల, డిసెంబర్ 8: మిచౌంగ్ తుపాన్ కారణంగా మండలంలోని బండ్రేవు, పెద్దనల్లబెల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ శుక్రవారం రాత్రి పరిశీలించారు. బాధిత రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. జడ్పీటీసీ సభ్యురాలు తెల్లం సీతమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణ మూర్తి, నాయకుడు కణితి రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తెల్లం దంపతులను సన్మానిస్తున్న నాయకులు

తెల్లం దంపతులకు సత్కారం

సారపాక, డిసెంబర్ 8: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దంపతులను బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలి శ్రీహరి సత్కరించారు. నాయకులు బాలి అక్షిత్, బత్తిన నాగప్రసాద్, విజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుసాక ఆశ్రమ పాఠశాలకు పీవో

ఉపాధ్యాయినితో మాట్లాడుతున్న పీవో ప్రతీక్ జైన్

బూర్గంపహాడ్, డిసెంబర్ 8: మండలంలోని ఉప్పుసాక గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఆకస్మికంగా సందర్శించారు. వేదిక్ మ్యాథ్స్ తరగతులను పరిశీలించారు. వేద గణితంపై విద్యార్థులతో సంభాషించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్లాస్ టైమ్‌లో తరగతి గదిలో కాకుండా స్టాఫ్ రూములో ఉన్న ఇద్దరు గణిత ఉపాధ్యాయులను హెచ్చరించారు. పదోతరగతిలో సంపూర్ణ ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయుడు ఎ.కృష్ణను ఆదేశించారు. డిప్యూటీ డైరెక్టర్ పి.మణెమ్మ పాల్గొన్నారు.

మంత్రులకు అభినందనలు

తుమ్మల, పాయంతో కాంగ్రెస్ నాయకులు

సారపాక, డిసెంబర్ 8: రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం హైదరాబాద్‌లో వేర్వేరుగా కలిసి అభినందనలు తెలిపారు. పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఇంగువ రమేష్, దారం కోటిరెడ్డి, భట్టా విజయ్‌గాంధీ, భజన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తలంబ్రాలతో శోభాయాత్ర

రామయ్య సన్నిధికి చేరిన శోభాయాత్ర

భద్రాచలం, డిసెంబర్ 8: అయోధ్య నుంచి రామయ్య తలంబ్రాలతో విశ్వహిందూ పరిషత్ చేపట్టిన శోభాయాత్ర శుక్రవారం భద్రాచలం చేరుకుంది. బీజేపీ శ్రేణులు స్వాగతం పలికాయి. ఆ పార్టీ నాయకులు గడదేశి వెంకటేశ్వరరావు, కుంజా ధర్మా, త్రినాథరావు, ఎర్రంరాజు బెహరా, నిడదవోలు నాగబాబు, గంగాధరి సీత తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పల నగర సంకీర్తన, పడిపూజ

పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప దీక్షాపరులు

దుమ్ముగూడెం, డిసెంబర్ 8: మండల కేంద్రమైన లక్ష్మీనగరంలో శుక్రవారం 108 మంది అయ్యప్ప దీక్షాధారులు నగర సంకీర్తన, పడిపూజ నిర్వహించారు. అన్న ప్రసాదం స్వీకరించారు. గురుస్వాములు జీరి సత్యనారాయణ, పూదోట శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఇతర గురుస్వాములు కాకి భాస్కర్, వేముల శ్రీను, గోసుల వెంకటేశ్వరరావు, పంపన పవన్, పతివాడ జగదీష్, సిరపు వీర్రాజు, గుడ్ల తాతారావు, దల్లి హరిబాబు, గుడ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'రామకోటి' నిమజ్జనం

భద్రాచలం, డిసెంబర్ 8: రామకోటి పుస్తకాలతో అహోబిల మఠం ఆధ్వర్యంలో నృసింహ సేవావాహిని చేపట్టిన శోభాయాత్ర శుక్రవారం భద్రాచలం చేరుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో భక్తుల నుంచి సేకరించిన 108 కోట్ల శ్రీరామకోటి పుస్తకాలతో ఈ యాత్ర సాగింది. ఈ రామకోటి పుస్తకాలను పవిత్ర గోదావరిలో శనివారం నిమజ్జనం చేయనున్నట్లు సేవా వాహిని వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణచైతన్య తెలిపారు.

మణుగూరులో నేడు విద్యుత్ అంతరాయం

మణుగూరు టౌన్, డిసెంబర్ 8: మణుగూరు 133/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మణుగూరు, శివలింగాపురం, గాంధీ బొమ్మ సెంటర్, రాజుపేట, బాపణకుంట, కొత్తకొండాపురం, బండారుగూడెం మెయిన్ రోడ్డు సబ్ స్టేషన్ నుంచి రెండువైపులా అంబేద్కర్ సెంటర్ వరకు, ఆదర్శ నగర్, ఐలమ్మ నగర్, శేషగిరి నగర్, సుందరయ్య నగర్, భగత్ సింగ్ నగర్, అంబేద్కర్ సెంటర్ ఏరియా, వినాయక నగర్, కుంకుడుచెట్ల గుంపు, సురక్షా బస్టాండ్ ఏరియా, ఫిష్ మార్కెట్ ఏరియా, తిర్లాపురం, రామానుజవరం, సాంబాయిగూడెం, దమ్మక్కపేట, చిక్కుడుగుంట, పగిడేరు, శాంతినగర్, గొల్లకొత్తూరు, కొడిశలకుంట, బుగ్గ, ఖమ్మంతోగు, అనంతారం, అన్నారం, కమలాపురం, చినరావిగూడెం ఏరియాల్లో ఉదయం 9.00 నుంచి 11.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. దీనిని వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కానిస్టేబుళ్ల ఎంపిక అభ్యర్థులకు ఉచిత శిక్షణ

పినపాక, డిసెంబర్ 8: జనరల్ డ్యూటీ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే పరీక్షకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన గిరిజన యువత ఈ నెల 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. లేదా, భద్రాచలంలో ఐటీడీఏ కార్యాలయంలోగానీ, ఇల్లెందు వైటీసీలోగానీ సంప్రదించవచ్చని సూచించారు.

26 నుంచి భద్రాచలంలో నెహ్రూ కప్ క్రికెట్ పోటీలు

భద్రాచలం, డిసెంబర్ 8: ఈ నెల 26 నుంచి జనవరి 7వ తేదీ వరకు నెహ్రూ కప్ అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలను భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వాతాడి దుర్గాఅశోక్, తోట మల్ల బాలయోగి తెలిపారు. వారు శుక్రవారం భద్రాచలంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. తాము 1994 నుంచి నెహ్రూ కప్ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. విన్నర్-రన్నర్ జట్లకు నగదు బహుమతితోపాటు ట్రోఫీ అందిస్తామన్నారు. ఎంట్రీలను ఈ నెల 15వ తేదీలోగా కన్వీనర్ ఎస్కే సలీం(94401 01108)కు పంపాలని చెప్పారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

పర్ణశాల, డిసెంబర్ 8: మండలంలోని బైరాగులపాడు గ్రామంలోగల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఉత్సవ మూర్తుల విగ్రహావిష్కరణ, కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేశారు. విగ్రహ దాతలు వాచర్ల వీర వెంకట్రావు-లక్ష్మి, అనంత శ్రీనివాసు-ప్రతిమ దంపతులు పూజలు చేశారు. ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.